క్లుప్తంగా

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

టి.నరసాపురం: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాలల జిల్లా కన్వీనర్ డీఎస్‌బీ శంకరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు అప్పలరాజుగూడెం (బాలురు), నాగిరెడ్డిగూడెం (బాలికలు), ముసునూరు (బాలికలు) పాఠశాలలలో వచ్చే విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశానికి, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన ఖాళీలకు రూ.100 రుసుముతో ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు పోలవరం ఎమ్మెల్యే బాలరాజు పర్యటన

కొయ్యలగూడెం: పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి మంగళవారం కొయ్యలగూడెంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. పరింపూడి పంచాయతీకి సంబంధించిన సచివాలయం, విలేజ్ క్లినిక్‌లను బాలరాజు దంపతులు ప్రారంభిస్తారని, అనంతరం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

పట్టెన్నపాలెంలో ఈ-పంట గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్ రత్నకుమారి, నాగార్జునరావు

జంగారెడ్డిగూడెం రూరల్: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన చేస్తుందని సర్పంచ్ పసుపులేటి రత్నకుమారి అన్నారు. మండలంలోని పట్టెన్నపాలెంలో సోమవారం ఈ-పంట గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలను వ్యవసాయ శాఖ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ మండలి బోర్డు సభ్యుడు పసుపులేటి నాగార్జునరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక విడుదల



ఆలయ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం ఈ నెల 18వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ తెలిపారు. ఈ మేరకు సోమవారం వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక విడుదల చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ ఈ నెల 18, 19, 20 తేదీల్లో ఆలయ వార్షిక వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రధానార్చకులు సుదర్శనం వేణుగోపాల ఆచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్, మారిశెట్టి రాధాకృష్ణ, కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్, మాడా రామమోహనరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాటు సారా పట్టివేత

టి.నరసాపురం: మండలంలోని అల్లంచర్ల కొత్తగూడెం గ్రామంలో సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామ శివారులోని అటవీ భూమిలో గ్రామానికి చెందిన చిలుకబత్తుల అప్పన వెంకటేశ్వరరావు నాటు సారా తయారు చేస్తుండగా అరెస్టు చేసినట్లు హెచ్‌సీ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అతని వద్ద నుంచి 40 లీటర్ల నాటు సారా, ఒక మోటార్‌సైకిల్, గ్యాస్‌బండ, గ్యాస్ పొయ్యి, అల్యూమినియం గిన్నెలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ చెప్పారు

కార్యకర్తలకు అండగా..



కరీముల్లాను పరామర్శిస్తున్న విజయరాజు

చింతలపూడి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు అన్నారు. మండలంలోని కొమ్ముగూడెం గ్రామానికి చెందిన పార్టీ కార్యకర్త కరీముల్లా ఇటీవల అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కె విజయరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్‌లతో కలిసి సోమవారం కరీముల్లా నివాసానికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

నాడు కష్టాల బాట.. నేడు ప్రగతి బాట



నాడు అధ్వానంగా ఉన్న రోడ్డు



నేడు తారు రోడ్డు వేసిన తరువాత ఇలా..

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం కట్టవపాదలవారిగూడెం వెళ్లే రహదారి గతంలో చాలా అధ్వానంగా ఉండేది. గోతులమయంగా రహదారి ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. గత టీడీపీ ప్రభుత్వం రహదారి అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించడంతో ఈ రహదారిపై ప్రయాణాలు చేసే అనేక గ్రామాలకు చెందిన వాహనదారులు, ప్రజలు, రైతులు నరకయాతన అనుభవిస్తూ వచ్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడు ప్రాజెక్టులో రూ: 90 లక్షల నిధులతో 3 కిలోమీటర్ల వరకు రహదారిని నిర్మించారు. దీంతో అనేక సంవత్సరాలుగా ఈ రోడ్డు పరిస్థితితో ఇబ్బందులు పడుతున్న ప్రజలు.. ప్రస్తుతం రహదారి అభివృద్ధి చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ మొర ఆలకించి సమస్య తీర్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు, రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రహదారి ఇబ్బందులు తీరాయి



ఈ రహదారి ప్రయాణం నరకప్రాయంగా ఉండేది. గత టీడీపీ ప్రభుత్వంలో రహదారి మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రభుత్వంలో రూ.90 లక్షల నిధులతో రహదారి నిర్మాణ పనులు చేయడంతో ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా మారింది. పల్లె ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుండడం సంతోషంగా ఉంది.

– కనపర్తి రాజేష్, కట్టవపాదలవారిగూడెం

పోలవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయం

- ప్రతిపక్షాలవి ప్రజలను నట్టేట ముంచే పొత్తులు
- పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం బుట్టాయగూడెంలో ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రతిపక్షాలవి అనైతిక పొత్తులని అన్నారు. ప్రజలను నట్టేట ముంచే పొత్తులతో రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి ప్యాకేజీ తీసుకుని ప్రతిపక్షాలు ఎన్నికలకు సిద్ధమవుతున్నాయని అన్నారు. మేము చాలా బలవంతులమంటూ రాబోతున్నారని.. అయితే ఎంత బలవంతుడైనా చలి చీమల చేతచిక్కి చావదె సుమతీ అన్నట్లు ప్రతిపక్షాలు ప్రజల చేతిలో ఓటమి పాలు కావడం ఖాయమని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదల ఇంటికి సంక్షేమ పథకాలు చేరాయని అన్నారు. పథకాలు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాబోయే ఎన్నికలు పేదవారికి, పెత్తందారులకు మధ్య జరగబోతున్నాయని అన్నారు. అలాగే పోలవరం నియోజకవర్గంలో పేదలకు, పెత్తందారులకు మధ్య పోటి జరుగుతుందని అన్నారు. ఈ పోరులో వెన్నుపోటులొచ్చినా, ఆటుపోటులొచ్చినా, ఎన్ని కుయుక్తులు పన్నినా వాటిని ఛేదించి వైఎస్సార్ సీపీ జెండాను ఎగుర వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నాడు పోలవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించింది ఎమ్మెల్యే బాలరాజు అని.. నేడు పోలవరంలో అభివృద్ధి పరుగులు పెట్టడానికి కూడా కృషి చేసింది బాలరాజేనని అన్నారు. అలాగే ముందు పోలవరం నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీలు తెల్లం రమణ, కరాటం ఫణీంద్రకుమార్, చారపు సుజాత, సర్పంచ్ మడకం రామలక్ష్మి, పార్టీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, తెల్లం చిన్నారావు, కలగర నాని, అనుపోజు మురళి, ప్రకాష్, దినేష్, పాల్గొన్నారు.

పట్టిసంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



శివక్షేత్రం వద్ద దర్శనానికి వీలుగా ఏర్పాటు చేసిన క్యూలైన్‌లు



ఇసుక తిన్నెలపై ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు



ఇసుక తిన్నెలపై గోనెసంచులతో ఏర్పాటుచేసిన కాలి నడక మార్గం

పోలవరం రూరల్: ప్రసిద్ధి చెందిన పట్టిసం శివక్షేత్రానికి మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తుల సౌకర్యార్థం చేసే ఏర్పాట్లు దాదాపు పూర్తి కావచ్చాయి. పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రంలో ఈ నెల 8వ తేదీ మహా శివరాత్రి సందర్భంగా మూడు రోజులు పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు అధికార యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. శివక్షేత్రం వద్ద భక్తుల దర్శనానికి వీలుగా షామియానాలు, టెంట్‌లు, ఐరన్ బారీకేడింగ్‌తో క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అలంకరణ నిర్వహించారు. అలాగే ఇసుక తిన్నెలపై చలువ పందిళ్లు, తాత్కాలిక దుస్తులు మార్చుకునే గదుల పనులు పూర్తయ్యాయి. ఇసుకలో కాలినడకన వెళ్లే భక్తులు ఇబ్బందులు పడకుండా ఇసుక బస్తాలపై నడిచి వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేశారు. నదిని దాటేందుకు ఐదు పంట్లతో నదిపై తాత్కాలిక రహదారి మార్గం ఐరన్ బారీకేడింగ్‌తో పటిష్టం చేశారు. రేవులో, నది ఒడ్డున చలువ పందిళ్లు, క్యూలైన్‌లో, అధికారుల తాత్కాలిక మకాంకు షెడ్ల నిర్మాణాలు చేపట్టారు. సంబంధిత శాఖాధికారులు పూర్తిగా పనుల్లో నిమగ్నమయ్యారు.

నేడు మూడవ విడత సమావేశం

పట్టిసం మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై ఈ నెల 5వ తేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు పట్టిసం రేవులో 3వ దఫా సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ కె.అద్దయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

జగనన్న ఇళ్ల పట్టాల పంపిణీ



జంగారెడ్డిగూడెంలో జగనన్న ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: అక్క చెల్లెమ్మల పేరున ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని సీఎం వైఎస్ జగన్ చెప్పినట్లుగానే నేడు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేయడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రిజిస్ట్రేషన్ పత్రాలను అందించే కార్యక్రమం సోమవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 140 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, సీనియర్ నాయకులు మేడవరపు విద్యాసాగర్, కౌన్సిలర్ దొంతు మాధవ, చిన్న తిరుపతి దేవస్థానం డైరెక్టర్ వాసా రామకృష్ణ, నాయకులు బత్తిన చిన్న, చక్రధర్ రావు, చిప్పాడ వెంకన్న, నాడు అశోక్, నేత్రు గణేష్ యాదవ్, చిటికెల సత్యనారాయణ, అక్కల మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన బాలిక తల్లి స్థానికంగా ఒక బట్టల దుకాణంలో పనిచేస్తోంది. ఉదయం షాపునకువెళ్లిన ఆమె మధ్యాహ్నం ఇంటికి వచ్చే సరికి బాలిక కనిపించ లేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో, బాలిక మేనమామ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం గ్రామానికి చెందిన యువకుడితో తరచుగా బాలిక సెల్‌ఫోన్‌లో మాట్లాడేదని, బాలిక అదృశ్యంపై అతనిపై అనుమానం ఉన్నట్లు బాలిక మేనమామ ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు పరికరాలు అందజేయాలని వినతి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని బీసీకాలనీ వడ్డీల పేటకు చెందిన గోదావరి బోట్స్‌మన్ అండ్ ఫిషర్‌మన్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్.ప్రసాద్‌కు వడ్డీల పేట ప్రజలు వినతిపత్రం సమర్పించారు. వడ్డీల సామాజిక వర్గానికి చెందిన తాము గోదావరి, చెరువుల్లో చేపల వేట చేసి జీవనం సాగిస్తున్నామని పేర్కొన్నారు. వేటకు సంబంధించిన పరికరాలను అందజేయాలని మత్స్య శాఖ అధికారులకు గతంలో విజ్ఞప్తి చేశామని చెప్పారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా సంఘం నుంచి 25మంది వాహనాల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. తమ వేటకు అవసరమైన పరికరాలు అందజేయాలని ఎం.వెంకటరావు, జి.కృష్ణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద వినతిపత్రం అందజేశారు.

హైస్కూల్‌లో భోజనశాల నిర్మాణానికి శంకుస్థాపన



భోజనశాల నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న నేతలు

చింతలపూడి: ప్రగడవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థుల భోజనశాల నిర్మాణానికి సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. తెలంగాణ రాజ్యసభ సభ్యులు, హెట్రో డ్రగ్స్ అధినేత డా బండి పార్థసారధి రెడ్డి రూ.33 లక్షలు విరాళంగా ఇచ్చినట్లు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. పార్థసారథిరెడ్డి కూడా పాఠశాల పూర్వ విద్యార్థి అని చెప్పారు. ఒకే సారి 500 మంది విద్యార్థులు భోజనం చేసే విధంగా భోజనశాలను నిర్మిస్తున్నట్లు జ్ఞానారెడ్డి తెలిపారు. తాను చదువుకున్న పాఠశాలకు నిధులు విరాళంగా అందచేసిన పార్థసారథిరెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ అలవాల బాబు, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చింతలపూడి: యర్రగుంటపల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు సోమవారం దాడి చేసి పట్టుకున్నారు. సుమారు రెండు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుటుంబరావు తెలిపారు.

రోగులను ఆప్యాయంగా పలకరించండి

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



బుట్టాయగూడెం సామాజిక కేంద్రంలో బ్లడ్ స్టోరేజ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలరాజు, రాజ్యలక్ష్మి

బుట్టాయగూడెం: ప్రభుత్వాస్పత్రులకు వచ్చే రోగులను ఆప్యాయంగా పలకరించి వారికి మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు. స్థానిక సామాజిక కేంద్రంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను సోమవారం ఎమ్మెల్యే బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మిల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్లడ్ స్టోరేజ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు క్లిష్టమైన పరిస్థితులలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా రక్తం అవసరమైన వారికి సకాలంలో రక్తం ఎక్కించి సకాలంలో వైద్యం అందించవచ్చని అన్నారు. గిరిజన ప్రాంతంలో రక్తహీనతతో బాధపడేవారు ఉన్నారని వారిని గతంలో ఇతర ప్రాంతాలకు రిఫర్ చేసేవారని.. ఇక ఆ ఇబ్బందులు ప్రజలకు ఉండవని అన్నారు. ఆస్పత్రిలో అధునాతనమైన వైద్య పరికరాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అలాగే అనుభవజ్ఞులైన వైద్యులను నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, ఎంపీటీసీలు తెల్లం రమణ, కరాటం ఫణీంద్రకుమార్, చారపు సుజాత, సర్పంచ్ మడకం రామలక్ష్మి, పార్టీ నాయకులు ఆరేటి సత్యనారాయణ, తెల్లం చిన్నారావు, కలగర నాని, డాక్టర్‌లు జనార్ధన్, హేమంత్, వసుంధర, ప్రశాంత్, కౌశిక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ బకాయిలపై రైతులను ఇబ్బంది పెట్టొద్దు



రైతుల సమస్యలపై డీసీసీబీ చైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: సొసైటీలో బకాయిలు ఉన్న రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డీసీసీబీ చైర్మన్ నరసింహరాజును కోరారు. బకాయిలు చెల్లించాలంటూ సొసైటీ ద్వారా నోటీసులు అందుకున్న రైతులు సోమవారం బాలరాజును కలిశారు. ఈ సందర్భంగా తమకు బకాయిలు చెల్లించేందుకు కొంత వ్యవధి కావాలని కోరారు. వీలైతే ఒన్‌టైమ్ సెటిల్‌మెంట్‌గా బకాయిలు చెల్లించే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే బాలరాజు డీసీసీబీ చైర్మన్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. అలాగే ఇది పెట్టుబడి సీజన్ అని ఈ పరిస్థితుల్లో బకాయిలు చెల్లించాలని ఒత్తిడి చేస్తే రైతులు ఇబ్బంది పడతారని అన్నారు. బకాయిల చెల్లింపునకు కొంత సమయం ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. అలాగే అధికారులు రైతులను ఎటువంటి ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రైతులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, సూర్యచంద్రం, పుసులూరి అచ్యుత రామయ్యతోపాటు పలువురు రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జెట్టికి ఘన స్వాగతం



జెట్టి గురునాథరావుకు స్వాగతం పలుకున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన జెట్టి గురునాథరావుకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆయన వెంటే జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ముప్పిడి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు జెట్టిని దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కంభం విజయరాజు, గురునాథరావుతో కలిసి భారీ ర్యాలీగా జంగారెడ్డిగూడెం చేరుకున్నారు. కామవరపుకోట మండలం తడికలపూడి నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ రావికంపాడు, దేవులపల్లి, పుట్లగట్లగూడెం, గురవాయిగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం చేరుకుంది. దారి పొడవునా జనం నీరాజనాలు పలికారు.

ప్రజల్లో ధైర్యం నింపేందుకు.. మార్చ్‌ఫాస్ట్



జంగారెడ్డిగూడెంలో పారామిలటరీ ఫోర్స్, పోలీసులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నట్లు పోలవరం డీఎస్పీ, జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం పారామిలటరీ ఫోర్స్, పోలీసులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్‌కు 90 మంది పారామిలటరీ ఫోర్స్‌ను నియమించడం జరిగిందని, వీరందరూ ఆదివారం రాత్రి జంగారెడ్డిగూడెం చేరుకున్నారు. వీరితో సోమవారం పట్టణంలో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించడం జరిగిందన్నారు. మార్చ్‌ఫాస్ట్ నిర్వహించడం ద్వారా ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తామున్నామనే చెప్పేందుకు ఈ మార్చ్‌ఫాస్ట్ అన్నారు. అలాగే అసాంఘిక శక్తులను చెలరేగకుండా వారిని సైతం అదుపులో ఉంచేందుకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేసుకోవాలని ఆయన సూచించారు. జంగారెడ్డిగూడెం పట్టణంతో పాటు డివిజన్‌లోని అన్ని మండలాల్లో మార్చ్‌ఫాస్ట్ ప్రక్రియ నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో సీఐ పి.జ్యోతిబాస్, ట్రాఫిక్ ఎస్సై రంగయ్య, ఎస్సై పి.జ్యోతిబాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు



ఆరిపాటి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: 15వ ఆర్థిక సంఘం నిధులు, మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీపీ గంజిమాల రామారావు తెలిపారు. సోమవారం కనకాద్రిపురం(ఆరిపాటి)లో జగనన్న కాలనీకి సిమెంట్ రోడ్ల పనులకు ఎంపీపీ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. అందులో ప్రధానంగా సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు, వీధిలైట్లు, మంచి నీటి సదుపాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కుంతలగుడెం గ్రామ కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గోపాల్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట కృపామణి, తిమ్మన్నకుంట గ్రామ కమిటీ అధ్యక్షుడు చవల నాగేశ్వరావు, కనకాద్రిపురం గ్రామ పెద్దలు రాపోలు భాస్కరరావు, రాజవరపు శ్రీను, చాపల సంకురియ్య, గ్రామ సీఏ సకినాల రత్నకుమారి, దుదుగుల నాగమణి, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.